క్లుప్తంగా

13న మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవుతారని, మండల స్థాయి అధికారులంతా రావాలని కోరారు.

లైన్‌మన్‌కు తీవ్రగాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మన్ బిడ్డిక ఆనందరావుకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ పునరుద్ధరణకు అక్కడి విద్యుత్‌స్తంభం ఎక్కుతున్న క్రమంలో అదుపుతప్పి కింద పడి గాయపడ్డారు. ఈ ఘటనలో ఆయన తల, ఇతర శరీర భాగాల్లో గాయాలయ్యాయి. గ్రామస్తులు అప్రమత్తమై చికిత్స నిమిత్తం భద్రగిరి ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఫోన్‌లకు వచ్చే అనవసర సందేశాలు, ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్)లకు స్పందించవద్దన్నారు. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మరో అల్పపీడనం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో వీఆర్‌వోలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు పీఎస్ లక్ష్మీసత్యకుమార్ సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నదీ పరివాహన ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, అటువైపుగా వెళ్లకుండా చూడాలన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే సహించేది లేదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సింగన్నవలస గ్రామస్తులు

పాలకొండ: తమ గ్రామం పరిధిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే సహించేది లేదని మండలంలోని సింగన్నవలస గ్రామస్తులు స్పష్టం చేశారు. నగరపంచాయతీకి సంబంధించిన చెత్తను సింగన్నవలస పరిధిలోని ప్రభుత్వ భూమిలో డంప్ చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. దీంతో ఆ గ్రామస్తులు దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రతినిధి చేబోదుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పచ్చని పంట పొలాల మధ్యలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే తమ గ్రామం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. ఆయనతో పాటు ఉపసర్పంచ్ కాయల దామోదరావు, గ్రామ పెద్దలు ఉన్నారు.

చిరుధాన్యాలతో రక్తహీనత దూరం



పౌష్టికాహార ప్రదర్శనలో ఐసీడీఎస్ సిబ్బంది


భామిని: గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించేందుకు, ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని సీడీపీఓ శాంతి భవాని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ ఆరోగ్య అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



- ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో సిస్టం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు
- ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి, మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అనుమతుల కోసం ప్రత్యేకంగా సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ముందుగా హెచ్‌టీటీ పీఎస్//గణేష్‌ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, న్యూ అప్లికేషన్‌పై క్లిక్ చేసి, దరఖాస్తుదారుని ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేస్తే, ఓటీపీ(వన్‌టైమ్ పాస్‌వర్డ్) వస్తుందని, ఆ ఓటీపీని ఎంటర్ చేసిన తర్వాత, మొబైల్ నంబర్ వెరిఫికేషన్ పూర్తయి, దరఖాస్తు విండో ఓపెన్ అవుతుందన్నారు. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుని పేరు ఈ–మెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్ పేరు గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న స్థలం, చిరునామా వివరాలు, ఏ సబ్‌డివిజన్.. ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి ఉత్సవాలు నిర్వహించే స్థలం వస్తుందన్న విషయాలతో పాటు, విగ్రహం, మండపాల ఎత్తులు వంటి వివరాలు పొందుపరచాలన్నారు. అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు వారి ఫోన్‌నంబర్లు, నిమజ్జనం తేది, సమయం, నిమజ్జనంలో వినియోగించే వాహనాల వివరాలు నమోదు చేయాలన్నారు. ఇలా వివరాలు ఇచ్చిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకి వెళ్తుందని, తర్వాత మండపాలు, స్థలాన్ని పరిశీలించి అవి సక్రమంగా ఉంటే మీ–సేవలో గానీ, గ్రామసచివాలయంలో గానీ చలానా చెల్లిస్తే అనుమతులతో కూడిన నిరభ్యంతర పత్రం డౌన్‌లోడ్ అవుతుందన్నారు.వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకే ఈ అనుమతులు అని, ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.



ఎస్‌ఐ రమేష్‌నాయుడు

ఉత్సవ నిర్వాహకులు సూచనలు..

- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రోడ్లపై విగ్రహాల ఏర్పాటు ఉండాలి.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించకుండా మట్టి విగ్రహాలను ఉపయోగించాలి.
- మండపాల వద్ద అధిక శబ్దాలు వెలువడే స్పీకర్లు వినియోగించరాదు, రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు ఆఫ్ చేయాలి.
- నిమజ్జన సమయం, రూట్‌మ్యాప్‌ను పోలీసులకు ముందుగా తెలియజేయాలి
- నిమజ్జనానికి ఉపయోగించే వాహనం వివరాలు ఇవ్వాలి.
- నిమజ్జన వాహనం నడిపే వ్యక్తికి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.
- మద్యం సేవించి వాహనం నడకూడదు.
- దీపారాధన సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.
- విగ్రహ ఊరేగింపులో బాణాసంచా వినియోగించకూడదు.
- ఊరేగింపు సమయంలో డీజే శబ్దాలు ఎక్కువగా ఉండకూడదు, అశ్లీల నృత్యాల ప్రదర్శన నిషేధం.
- బలవంతపు చందాలు, వసూళ్లు చేయరాదు, దర్శనాల టికెట్లు పెట్టుకూడదు.
- నిమజ్జనం తేదీ, సమయం తెలియజేయాలి.
- నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆ పార్టీ నేతలతో కలిసి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో బుధవారం ఆందోళన చేపట్టారు. రోజురోజుకూ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 పట్టుకుని మార్కెట్‌కు వెళ్తే సంచినిండా సరుకులు కూడా రావడం లేదన్నారు. మరోవైపు పెట్రోలు, డీజిలు ధరలు కూడా పెరిగిపోతున్నాయని, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేషన్ షాపుల్లో 14 రకాల సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా, కేవలం నాసిరకం బియ్యం మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, నిత్యావసరాల ధరలు తగ్గించాలన్నారు. అర్హులైన గిరిజనులకు ఇళ్లస్థలాలు కూడా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, మండంగి సింగన్న, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికే స్త్రీనిధి రుణాలు

గరుగుబిల్లి: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకే స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నట్లు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో గ్రామైక్య సంఘ సభ్యులతో బుధవారం సమావేశమైన ఆయన.. మహిళలకు వ్యక్తిగత రుణాల కింద రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రుణాలను వ్యాపారాలకు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీ సీహెచ్ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వీడీవీకేల కార్యకలాపాలు మరింత విస్తరించాలి

పార్వతీపురం: వన్ ధన్ వికాస్ కేంద్రాల(వీడీవీకే) కార్యకలాపాలు మరింత విస్తరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాదుల కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన బుధవారం సమీక్షించారు. వన్ ధన్ వికాస్ కేంద్రాలు జిల్లాలో లభ్యం అవుతున్న అన్ని పంటలు కొనుగోలుతో పాటు పాడిపశువుల నిర్వహణ, దర్జీ పని, సివిల్ కాంట్రాక్ట్ పనులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటి బహుముఖ పనులు చేపట్టవచ్చని ఆయనన్నారు. ఖాతాల నిర్వహణలో మంచి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సంబంధిత రికార్డుల నిర్వహణలో నైపుణ్యం ఉండాలని ఆయన ఆదేశించారు. వీడీవీకేలు పంట ఉత్పాదక సంఘాలు (ఫాం ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్)గా రూపాంతరం చెందవచ్చని ఆయన చెప్పారు. వీడీవీకేలను సంఘటిత రంగంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్రమాలు సంబంధిత విభాగాల సమన్వయంతో చేపట్టాలని ఆయన సూచించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ అన్ని సమన్వయం చేయాలన్నారు. ఐటీడీఏ, జిల్లా పరిశ్రమల శాఖ, నాబార్డు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య శాఖ, మెప్మా, చేనేత – జౌళి శాఖ తదితర విభాగాలు తమ పరిధిలో ఉపాధి అవకాశాలు కల్పనకు అన్ని వనరులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేకంగా మహిళలకు ఆసక్తి గల రంగాల్లో శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాలు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఒక జిల్లా – ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్) కింద సవర కళలలో శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయనన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు త్వరగా చర్యలు చేపట్టాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. జీవనోపాధులలో భాగంగా ప్రతి వారం కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం, జాబ్ మేళాలు ఎక్కువగా నిర్వహించడం, అన్ని దుకాణాలకు మన ఉత్పత్తులు సరఫరా చేయడం వంటి కార్యక్రమాలు జరగాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఆకాంక్ష, ఆమోద బ్రాండ్‌లతో జరుగుతున్న ఉత్పాదనలు భారీ స్థాయికి చేరాలని తద్వారా జీవనోపాధికి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి డిఎస్.దినేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫాం ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌ల ద్వారా రెండు వేల మందికి జీవనోపాధులు కల్పించుటకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఆశావహ బ్లాక్ కింద భామిని మండలంలో రెండు వందల మందికి జీవనోపాధులు కల్పించుటకు అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎస్.మూర్తి, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు మంజూరు చేయండి

గుమ్మలక్ష్మీపురం: ఇళ్లు లేని గిరిజనులకు ఇళ్లస్థలాలతో పాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఆమె స్వగృహంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని గిరిజనులు ఎంతోమంది ఉన్నారని, సరైన ఇల్లు లేకపోవడంతో వర్షానికి, ఎండలకు, చలికి ఉండలేకపోతున్నారన్నారు. అర్హులైన ప్రతీ గిరిజనుడికి పక్కా ఇల్లు అందివ్వాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు సూరయ్య, లింగరాజు పాల్గొన్నారు.

నాణ్యమైన మొక్కలు పెంచాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ పీఓ రమణ

సీతంపేట: నాణ్యమైన మొక్కలు పెంచాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ సూచించారు. స్థానిక హార్టీకల్చర్ నర్సరీ యూనిట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో పర్యాటకంగా ఎకో టూరిజం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం..

కొత్తూరు మండలం అడ్డంగి పంచాయతీ బొడ్డగూడకు చెందిన సవర నిఖిల్ అనే బాలుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాలుడి వైద్యఖర్చుల కోసం రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, పీహెచ్‌వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

భామిని: మండలంలోని పాలవలస సమీపంలో బుధవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 1500 లీటర్ల పులిసిన బెల్లం ఊటను గుర్తించినట్లు ఎస్సై డి.అనీల్‌కుమార్ తెలిపారు. ఈ నిల్వలను ధ్వంసం చేసి డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ తరహా చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. సారా తయారీ, అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

10న వేస్ట్ మెటీరియల్ వేలం

పాలకొండ: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వృథాగా పడిఉన్న మెటీరియల్‌ను ఈ నెల 10న బహిరంగ వేలం వేయనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు బుధవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు నేరుగా ఆస్పత్రిలో సంప్రదించాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

పాలకొండ రూరల్: అత్యవసర సమయాల్లో రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వైద్య బృందాల పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. దాతలు స్వచ్ఛందగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ఉత్తమ గురువులు వీరే...



- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం
- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురి ఎంపిక
- జిల్లా అవార్డులకు 71మంది ఉపాధ్యాయులు

పార్వతీపురం టౌన్: గురుపూజోత్సవానికి వేళయింది. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారిని పార్వతీపురం లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సత్కరించనున్నారు. ఉదయం 9.30 గంటలకు అవార్డుల ప్రదానోత్సవం ప్రారంభమవుతుందని డీఈఓ జి.పగడాలమ్మ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలో అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయుల జాబితాను విడుదల చేశారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 71 మందిని జిల్లా విద్యా శాఖ ఎంపిక చేసింది. ఇందులో గ్రేడ్–2 హెచ్‌ఎంలు 10మంది, స్కూల్ అసిస్టెంట్లు 21మంది, 33 మంది సెకెండరీ గ్రేడ్ టీచర్లు, ఏడుగురు పీఈటీలు ఉన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయులు

జె.సంధ్య(కేజీబీవీ, జోగింపేట), వై.జగన్ (జెడ్పీహెచ్ఎస్, తలవరం), ఎన్.జ్యోతి(జీజీహెచ్ఎస్, సాలూరు), వై.చిన్నంనాయుడు(ఎల్‌హెఫ్ఎల్ హెచ్‌ఎం జీఈఎస్, పెదరామం), జి.శ్రీనివాసరావు(జెడ్పీహెచ్ఎస్, బందలుప్పి), ఆర్.శివకుమార్(ఏపీఎంఎస్, భామిని), సీహెచ్ సోమేశ్వరరావు(జెడ్‌పీహెచ్ఎస్, పీకేవీధి), ఎం.భాస్కరరావు(హెచ్ఎం, పెదపెంకి), ఎం.రత్నకుమారి(ఏపీఎంఎస్, ములక్కాయవలస), పి.శంకరరావు (జెడ్పీహెచ్ఎస్, కురుపాం)

స్కూల్ అసిస్టెంట్లు

జి.సోమశేఖరరావు(జెడ్పీహెచ్ఎస్, సీతానగరం), కె.నానిబాబు(జెడ్పీహెచ్ఎస్, తలవరం), కె.శివకుమార్(జెడ్పీహెచ్ఎస్, వీరఘట్టం), బి.వనజాక్షి(జీహెచ్ఎస్, సాలూరు), డి.శిబిభాషి(ఎంహెచ్ఎస్, డబ్బివీధి), ఐ.ముద్దులు(జీటిడబ్ల్యూఎహెచ్ఎస్, సీతంపేట), ఏవీ శ్రీనివాసరావు(జీటీడబ్ల్యూఎహెచ్ఎస్, సీతంపేట), మల్లి(జీటీడబ్ల్యూఎహెచ్ఎస్, సీతంపేట), డి.తిరుపతిరావు (జెడ్పీసాంస్క్రీట్‌హైస్కూల్, పార్వతీపురం), ఎ.రవిప్రసాద్(జీటీడబ్ల్యూఏహెచ్ఎస్, రావికోన), వై.ప్రవీణ్‌కుమార్(జీటీడబ్ల్యూహెచ్ఎస్, బెలగాం), జి.గౌరీవెంకట శేషగిరి (జెడ్పీహెచ్ఎస్, కోటిపాం), ఎం.రామారావు(జెడ్పీహెచ్ఎస్, బీజేపురం), జి.శ్రీనివాసరావు(జెడ్పీహెచ్ఎస్, నాగూరు), జి.సత్యనారాయణ(జెడ్పీహెచ్ఎస్, రావివలస), జె.సురేష్, (జెడ్పీహెచ్ఎస్, గరుగుబిల్లి), రఘురాం మహంతి (జెడ్పీహెచ్ఎస్, బాలేరు), ఎస్.జానకిరావు(ఏపీఎంఎస్, భామిని), పి.ధర్మారావు(జెడ్పీహెచ్ఎస్, పీకె వీధి), ఎం.రామలక్ష్మి(ఎన్‌పీయూపీఎస్, టిడ్కో కాలనీ), జి.శ్రీనివాసరావు(జెడ్పీహెచ్ఎస్, పాంచాలి).

పీడీలు

ఎం.శ్రీనివాసరావు (జెడ్పీహెచ్ఎస్, సీతానగరం), వై.సురేష్(జెడ్పీహెచ్ఎస్, తామరాపల్లి), జి.నాగేంద్రనాయుడు (జెడ్పీహెచ్ఎస్, నాగూరు), వి.సురేష్(జెడ్పీహెచ్ఎస్, బూర్జ), బి.అరుణకుమారి (ఐటీడీఏ, నీలకంఠాపురం), ఎస్.కళాణ్‌కుమార్(జీసీడబ్ల్యూఏహెచ్ఎస్, పెదకొల్ల), పి.ఆనంద్(జెడ్పీహెచ్ఎస్, మావిడిపల్లి), ఎ.సూర్యనారాయణ (జెడ్పీహెచ్ఎస్, పెదబొండపల్లి), జె.అలివేలుమంగమ్మ(ఎంపీయూపీఎస్, ఆర్ఎస్‌పురం), ఆర్.శ్రీదేవి(ఎంపీఎల్ స్కూల్, గెంబలి వీధి), ఎస్.విజయ(జీఈఎస్, గెడ్డపాయి).

ఉత్తమ సెకండరీ గ్రేడ్ టీచర్లు

కె.శంకరరావు (ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, లచ్చయ్యపేట), వి.పొట్టయ్య(ఎంపీపీఎస్, గుగ్రువలస), బి.రవి(ఎంపీపీఎస్, పెద్దవలస), పి.శ్రీరాములు (ఎంపీపీఎస్, కొడిజ), టి.తాతబాబు(ఎంపీఎస్, చినబొండపల్లి), డి.లక్ష్మణరావు(ఎంపీపీఎస్, కొత్తూరు), పి.సుధారాణి(ఎంపీపీఎస్, కోటిపాం), యు.చిన్నతల్లి (ఎంపీపీఎస్, గాజులగూడ), ఎం.పద్మావతి(ఎంపీఎస్, కేపీడీ వలస), జి.ప్రభాకరరావు (ఎంపీపీఎస్, రాజయ్యపేట), పి.రంగయ్య(ఎంపీపీఎస్, చినమేరంగి), డి.మాధవీలత(ఎంపీపీఎస్, రావివలస), వి.ధనుంజయనాయుడు(ఎంపీయూపీఎస్, కొత్తపల్లి), పి.రవీంద్ర(ఎంపీయూపీఎస్, కొంకిడివరం), బీవీ రమణ (ఎంపీపీఎస్ అన్నవరం), జి.గౌరమ్మ(జీపీఎస్‌సీడబ్ల్యూ, సిరికొండ), పి.మాధురి(జీపీఎస్, కెంగువ), ఎం.ఝాన్సీ(ఎంపీపీఎస్, టెంకసిల్లి), టి.శ్రీలక్ష్మి(జీపీఎస్, కోరసింగి), జి.రామరావు(ఎంపీపీఎస్, మిర్తివలస), జి.శ్రీరామ్మూర్తి(ఎంపీపీఎస్, నూకలవాడ), బి.అప్పలస్వామి(ఎంపీపీఎస్, పెదపెంకి–1,) వై.విజయరాజు(ఎంపీపీఎస్, పద్మాపురం), బి.నారాయణరావు(ఎస్‌జీటీ, గొట్టూరు), పి.శ్రీనివాసరావు(జీపీఎస్, సురగడవలస), యు.భుజంగరావు(ఎంపీపీఎస్, ఎస్.పెద్దవలస), ఎస్.విశ్వేశ్వరరావు(ఎంపీపీఎస్, గుంటభద్ర), ఎస్.సుగుణావతి(ఎంపీపీఎస్, మోదవలస), పి.శ్రీనివాసరావు(జీపీఎస్, కొండబారిడి), యు.చామంతి(జీయూటీఎస్, పెదగొత్తిలి), ఎన్.లజపతిరాయ్ (జీపీఎస్, పనసభద్ర)

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం..

- బడితోట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఈఓ పగడాలమ్మ

వీరఘట్టం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. వీరఘట్టం జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల ఆవరణంలో బుధవారం నిర్వహించిన 'మనబడి–మనతోట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి విత్తనాలు నాటారు. వ్యవసాయం నేర్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 'మనబడి–మనతోట' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని డీఈఓ జి.పగడాలమ్మకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కలెక్టర్‌కు వినతి

వీరఘట్టం పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు స్థానిక నాయకులు జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీరఘట్టంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్, రైతు బజార్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

సాయం చేయండి సార్..

లేవలేని స్థితిలో ఉన్న తన భర్తకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని నడుకూరు గ్రామానికి చెందిన ఉమారాణి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కోరారు. తన భర్త సింహాచలంకు మూడు నెలల కిందట విశాఖపట్నం కేజీహెచ్‌లో బ్రెయిన్ ఆపరేషన్ చేశారని, అప్పటి నుంచి ఆయన కాళ్లు, చేతులు పనిచేయడం లేదని, మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్నారని కలెక్టర్‌కు వివరించింది. దీనిపై పరిశీలించి పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణకు కలెక్టర్ సూచించారు.

పరామర్శ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బీరుపాడు గ్రామ సర్పంచ్ కె.కళావతిని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి బుధవారం కలిసి పరామర్శించారు. సదరు సర్పంచ్ సోదరి కె.కోనమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల ఎంపీపీ కుంబురుక దీనమయ్య, శెట్టి పద్మావతి, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, కురుపాం జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లెల సుజాత, ఎంపీటీసీ సభ్యులు కొండగొర్రి కవిత, నిమ్మక ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గోరిశెట్టి గిరిబాబు, నిమ్మక గోపాల్, తోయక గోపాల్, హర్షవర్ధన్, కృష్ణమూర్తి, రాజేష్, నాగు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

మహిళా మార్ట్ నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి

- వ్యాపారం డీలా పడుతుంటే ఏం చేస్తున్నారు..
- వెలుగు సిబ్బందిని ప్రశ్నించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: డ్వాక్రా సంఘాలు వీరఘట్టంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ నిర్వహణపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెల 29న సాక్షిలో ప్రచురితమైన 'మహిళా మార్ట్ వ్యాపారం డీలా' కథనంతో కలెక్టర్ మార్ట్‌ను బుధవారం సందర్శించారు. మార్ట్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌లో వ్యాపారం ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. ఎప్పుడూ మహిళా సంఘాల సభ్యులతో సరుకులు కొనుగోలు చేయించడమే కాకుండా స్థానికులతో ఇక్కడ సరుకులు కొనుగోలు చేసేలా వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మార్ట్‌లో వ్యాపారం పడిపోతుంటే మీరేం చేస్తున్నారని ఇన్‌చార్జి డీపీఎం సతీష్, ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడును ప్రశ్నించారు. వ్యాపారంలో మెలకువలు పాటించాలని, సరుకుల కొనుగోలుపై డిస్కౌంట్ ప్రకటించాలని, ఈ విషయం ప్రజలకు తెలిసేలా ప్రచారం ఉండాలని సూచించారు. బంగారం దుకాణం వలె లోపల ఏసీ వేసుకుని కూర్చుంటే ఎవరూ రారని, వ్యాపార టెక్నిక్స్‌తో ప్రజలను ఆకర్షించి సరుకులను విక్రయించాలని సూచించారు. అవసరమైతే వసతిగృహాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు టెండర్లు వేయాలని, ఆ టెండర్లు మార్ట్‌కే వచ్చేలా చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అవసరమైతే కాయగూరలు కూడా విక్రయించాలని, గిరిజనోత్పత్తులు కూడా విక్రయించేలా చర్యలు చేపట్టాలని ఏపీఎం శివన్నాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, మార్ట్ నిర్వాహకులకు కలెక్టర్ ఆదేశించారు.



వీరఘట్టంలోని మహిళా మార్ట్‌లో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్